క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

గద్వాల అర్బన్: ధరూర్ మండలం రేవులపల్లిలోని నీటి శుద్ధి కర్మాగారం శుభ్రపర్చేందుకు గురువారం జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా నిలిపేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి చంద్రకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

మున్సిపల్ చైర్ పర్సన్‌కు వినతి



శాంతినగర్ : శాంతినగర్ రామచంద్రానగర్ కాలనీలో విద్యుత్, నీటి సరఫరా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ చైర్ పర్సన్ కరుణకు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కమిషనర్, సిబ్బంది, విద్యుత్ అధికారులతో మాట్లాడి వెంటనే రెండు సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణ, కాలనీవాసులు మనోజ్ కుమార్, రవి, రాఘవేంద్ర, గణేష్, శేఖర్, మహేష్ ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ ఉత్తమ సేవలకు గాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డిప్యూటీ స్పీకర్ పద్మారావుతో అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థినులు ఇప్పటి నుంచే క్రమశిక్షణతో మెలుగుతూ కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

అండర్-14,17లకు సెలక్షన్స్

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18న అండర్-14, 17 విభాగాలకు చెందిన బాల బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు పీఈటీ భరత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అండర్ -14కు 2010 జన్మించి 8వ తరగతి లోపు వారు అర్హులని, అండర్-17కు 2007లో జన్మించి 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

గద్వాల అర్బన్: నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం నడిగడ్డ హక్కుల పోరాట సమితి పోరాటం చేస్తుందని జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాగేష్ యాదవ్, వీరేష్, రాముడు, పవన్, గోపాల్ తదితరులు ఉన్నారు.

అప్పుల రాష్ట్రంగా మార్చారు

ఎర్రవల్లిచౌరస్తా: మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని వేములలో మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లెబాట- బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తీర్చడం కోసం ఈ నెల 17న అన్ని మండల కేంద్రాల్లో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేకేరెడ్డి, మాణిక్యారెడ్డి, శారద, రామిరెడ్డి, బీసన్న, శ్రీను ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పట్టించుకోండి

మానవపాడు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పట్టించుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు కోరారు. బధవారం మండలంలోని కలుకుంట్లలో అంగన్‌వాడీ సెంటర్లను ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు సమకూర్చాలని, ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచాలని కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

అయిజ: సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎస్‌పీడీ ఆఫీస్ ముట్టడి చేపట్టడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌లో ఉంచడాన్ని ఖండిస్తూ కేజీబీవీ భవనం ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ప్రణీత, మద్దమ్మ, కృష్ణవేణి, చెన్న బసమ్మ, స్వాతి, నాగరత్నమ్మ, భూదేవి, పుష్ప, సుహాసిని పాల్గొన్నారు.

అప్పులతో 'మధ్యాహ్న భోజనం'

- అందని బిల్లులు.. నిర్వాహకులకు తిప్పలు
- జనవరి నుంచి గుడ్డు బిల్లుల్లేవు..



మానవపాడులో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత(ఫైల్)

మానవపాడు: 'మధ్యాహ్న' భోజనం పథకంలో పని చేసే నిర్వాహకులకు సకాలంలో బిల్లులందక తిప్పలు తప్పడం లేదు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తున్నారు. బిల్లులు రాక అప్పుల ఊబిలోకి వెళ్తున్నారు. అయినా సర్కారు సకాలంలో నిధులు మంజూరు చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్‌అవుట్ తగ్గించాలనే ఉద్దేశ్యంతో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు.

అలంపూర్ నియోజకగవర్గంలోని ఏడు మండలాల్లో 124 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో ప్రభుత్వ పాఠశాలలు 226, ఇందులో 125 ప్రాథమిక, 52 ప్రాథమికోన్నత, 49 జెడ్పీ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపు 29,265 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు 245 మంది నిర్వాహకులు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి ప్రభుత్వం ప్రతి నెల వేతనంగా రూ.1000 అందిస్తోంది. మధ్యాహ్న భోజనానికి అవసరమైన బిల్లులను తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విడుదల చేస్తుంది. స్కూళ్లు ప్రారంభమై మూడు నెలలు గడిచినా బిల్లులు మాత్రం రాలేదు. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు వారానికి మూడు కోడిగుడ్లు విద్యార్థులకు ఇవ్వాలి. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తోంది. ప్రైవేట్‌గా ఒక్కో గుడ్డు ధర రూ.6 పడుతోంది. అదనంగా రూ. 1 భారం నిర్వాహకులపై పడుతోంది. 2023 జనవరి నుంచి నేటి వరకు గుడ్ల బిల్లులు అందించలేదు.

నిర్వాహకులపై రూ.50వేల భారం..

పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలైనా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే అందిస్తోంది. మిగితా కిరాణం, నిత్యవసరాలకు నిర్వాహకులు ఖాతా పెట్టి తెస్తున్నారు. వందమంది విద్యార్థులున్న పాఠశాలలో రోజుకు రూ.750 నుంచి రూ. 1000 వరకు నిర్వాహకులపై భారం పడుతోంది. ఒకనెలలో కనీసం రూ.20వేల నుంచి రూ.25వేలు వరకు భరించాల్సి వస్తోంది. ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకు ఒక్కో నిర్వాహకులపై రూ.50వేల భారం పడుతోంది.

గిట్టుబాటు కావడం లేదు..



కూరగాయలు, నూనెలు, ఇతర నిత్యవసర ధరలు భారీగా పెరిగాయి. మాకు ప్రభుత్వం ఇచ్చే బిల్లులు పెంచడంలేదు. పెరిగిన ధరలతో పిల్లలకు భోజనం పెట్టడం భారం అవుతోంది. ప్రభుత్వం బిల్లులు సరిగా ఇవ్వడం లేదు. వంట చేసి పెట్టడం కష్టంగా మారింది.

– జగ్గుల గిడ్డమ్మ, పీఎస్ మానవపాడు

సమస్యలు పరిష్కరించాలి..



పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి. మధ్యాహ్న భోజనం పెడుతున్న వర్కర్లకు ప్రతినెలా రూ.10వేల గౌరవ వేతనం చెల్లించాలి. క్రమం తప్పకుండా బిల్లులు విడుదల చేయాలి. మూడు నెలల బిల్లులను తక్షణమే విడుదల చేయాలి. బిల్లులు సరిగా అందిస్తేనే విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుంది.

– నాగేశ్వరమ్మ, చిన్నపోతులపాడు

నివేదికలు పంపించాం..

మూడు నెలలకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. నిధులు రాగానే మధ్యాహ్న భోజన నిర్వాహకుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం.

– సిరాజుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి జోగుళాంబ గద్వాల

పేదలకు అండగా సీఎం కేసీఆర్



మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

శాంతినగర్: నిరుపేదలకు వివిధ పథకాలు ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. వడ్డేపల్లి ఐకేపీ భవనంలో బుధవారం ఆయా గ్రామాలకు చెందిన మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులకు పెళ్లిళ్ల భారం కాకూడదనే ఉద్దేశ్యంతో కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టారన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మె ల్యే అబ్రహం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ, మండలాధ్యక్షుడు మహేశ్వరెడ్డి, జయచంద్రారెడ్డి, మధునాయుడు, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉండవెల్లి: తహసీల్దార్ కార్యాలయంలో 33 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అబ్రహం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీ దేవన్న, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రేఖ, ఉప సర్పంచ్ సయ్యద్ రెహ్మాన్, ఎంపీటీసీ రాజశేఖర్, సుంకన్న, డీటీ జయంతి, జూనియర్ అసిస్టెంట్ రజనీ కుమార్ పాల్గొన్నారు.

లిఫ్ట్ నీటి విడుదల

అలంపూర రూరల్: మండల పరిధిలోని ఉట్కూర్ గ్రామ లిఫ్ట్ మోటర్‌ను ఆన్‌చేసి ఎమ్మెల్యే అబ్రహం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. లిఫ్ట్ మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

31లోగా పంటల నమోదు చేసుకోవాలి



అమరవాయి క్లస్టర్‌లో పంటల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

మానవపాడు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల నమోదు ఈ నెల 31వ తేదీ లోపు పూర్తి చేయాలని ఏడీఏ సక్రియానాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని అమరవాయి క్లస్టర్‌లో వివిధ రకాల పంటల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పొలాల్లో వేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుల వివరాలను నమోదు చేసుకుంటే ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి అనుకులంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో వివరాలు సేకరిస్తున్న ఏఈఓలకు రైతులు సహకరించాలన్నార. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు



పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు

రాజోళి: మండలంలోని తూర్పు గార్లపాడు పాఠశాలకు బుధవారం గ్రామస్తులు తాళం వేసి నిరసన తెలిపారు. గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉండగా 60 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థులందరికీ ఒకే ఉపాధ్యాయుడు 8 ఏళ్లుగా పాఠాలు బోధిస్తున్నాడు. దీంతో విద్యార్థులకు సరైన విద్య అందక, ఉపాధ్యాయుడిపై ఒత్తిడి పడుతోంది. ఈ విషయాన్ని గతంలో ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసి అక్కడే బైఠాయించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషమ్మ, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

మానవపాడు: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక, మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రూ.9వేల కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.42వేల కోట్ల అప్పు చేసినట్లు తెలిపారు. కేవలం లిక్కర్ ద్వారా ఆదాయం ఉందని, విద్యుత్, భూముల రిజిస్ట్రేషన్ల ధరలు భారీగా పెరిగాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ధనుంజయగౌడ్, రవి, ఈశ్వర్, మహేష్, బీచుపల్లి, రాఘవయ్య, నరసింహులు, అచ్చి తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుదారుల వివరాల సేకరణ



గృహలక్ష్మి దరఖాస్తుదారులతో వివరాలు సేకరిస్తున్న అధికారులు

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని జిల్లెడుదిన్నెలో గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్, రేషన్‌కార్డులు, ఖాళీ స్థలాలు, గుడిసెల వివరాలను ఎంపీడీఓ రవీంద్ర బుధవారం పరిశీలించారు. గ్రామంలో 61 మంది మహిళలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారని, వారిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంతమంది అర్హులనే విషయమై ఇంటింటికి వెళ్లి పరిశీలించినట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలంలో మొత్తం 1110 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తు పెట్టుకున్న వారి ఇళ్లకు వెళ్లి పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఆయన తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి ఉన్నారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలో మండల పరిధిలోని గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను బుధవారం అధికారులు పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇంటి స్థలం, ఆధార్, ఆహార భద్రత కార్డు, ఓటర్‌ఐడీలను పరిశీలించారు. మండలంలో 1,610, మున్సిపాలిటీ పరిధిలో 838, మొత్తం 2,448 గృహలక్ష్మికి దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ నిత్యానంద్, ఎంపీడీఓ గోవిందరావు తెలిపారు. 20వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన ఉంటుందని వారు తెలిపారు.

ఆదిశిలాక్షేత్రంలో సప్తాహ భజనలు



ఆదిశిలాక్షేత్రంలో కొనసాగుతున్న సప్తాహ భజనలు

మల్దకల్ : ఆదిశిలాక్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భజనలను తిలకించేందుకు భజన మండలి సభ్యులు, భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, అర్చకులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆదిశిలాక్షేత్రంలో హరికథ..

మల్దకల్ : ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆంజనేయులు వేంకటేశ్వరస్వామి వారి జీవితచరిత్రను హరికథ రూపంలో భక్తులకు వివరించారు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో గద్వాల ప్రైవేట్ స్కూల్ యజమాన్యం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సామాజిక అంశాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కలిపిస్తున్న కళాబృందం సభ్యులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం పుటాన్‌దొడ్డిలో ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కోదండాపురం ఎస్ఐ కృష్ణదేవ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీమ్, పోలీస్ కళా బృందం సభ్యులు గ్రామ ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, డయల్ 100, పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం జరుగుతున్న పోకడల గురించి పాటలు, మాటల రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం వచ్చిన వెంటనే డయల్ 100కి సమాచారం అందించాలన్నారు. ఎక్కడైనా విద్యార్థులు, మహిళలు వేధింపులకు గురైతే షీ టీమ్ నంబర్లను 8712670312, 799313139 సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో షీ టీమ్, కళా బృందం సభ్యులు రాధమ్మ, హనుమంతు, రాంరెడ్డి, కృష్ణ, రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మానవపాడు: సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ రాము తెలిపారు. బుధవారం మండలంలోని అమరవాయిలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే అప్డేట్ చేయాలని, మెసెజ్‌లకు స్పందించవద్దని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యాధి నిరోధక టీకాలు



యూగోనిపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

అయిజ: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో మండలంలోని యూగోనిపల్లి, జడదొడ్డి గ్రామాల్లో ఆవులు, గేదెలు, ఎద్దులకు వ్యాధి నిరోదక టీకాలు వేశారు. రైతులు పశువులకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కోరారు.

శాంతినగర్ : పశువులకు ముందస్తుగా టీకాలు వేయించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ఆవులు, గేదెలు, ఎద్దులు ఆరోగ్యంగా ఉంటాయని వైద్యాధికారి పుష్పలత అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో గుంతల్లో ఉన్న కలుషిత నీరు తాగడంవల్ల, కలుషితమైన గాలి ద్వారా గాలికుంటు వ్యాధి సోకుతుందన్నారు. యజమానులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో బుధవారం 176 ఆవులు, ఎద్దులకు, 201 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: రైతుల పైప్‌లైన్‌ను పగులగొట్టడంతో వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ బాబు కథనం మేరకు..మండలంలోని శివనంపల్లి గ్రామానికి చెందిన గుడిసె రాముడు గ్రామానికి చెందిన మరో ఏడు మంది రైతులతో కలిసి రెండేళ్ల క్రితం రూ.3లక్షలతో వారి పంట పొలాల కోసం పైప్‌లైన్ వేసుకున్నారు. గత నెల 18వ తేదీన వారి పొలం పక్కన గత అదే గ్రామానికి చెందిన హనుమంతురెడ్డి రైతులు ఎవరూ లేని సమయంలో కోదండాపురానికి చెందిన భాస్కర్ జేసీబీ సహాయంతో పైప్‌లైన్‌ను ధ్వంసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన



గట్టు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ప్రోగ్రాం అధికారి రాజు సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సీడీ కార్నర్‌ను ఏర్పాటు చేయడంతో 30 ఏళ్ల పైబడిన వారు వచ్చి పరీక్షలను చేయించుకున్న తర్వాత వైద్యాధికారిని సంప్రదించాలని తెలిపారు. అనంతరం బీపీ, షుగర్ మందుల నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఉసేని, ఫార్మసిస్టు శ్వేత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

గట్టు : మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామ సీపీఎం కార్యదర్శి ఉరుకుంద కుటుంబ సభ్యులను బుధవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. ఉరుకుంద తండ్రి రొడ్డన్న అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు వీవీ నర్సింహ, మండల కార్యదర్శి ఆంజనేయులు, గట్టు మండల కార్యదర్శి తిమ్మప్ప, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కూరు సవారన్న, మండల అధ్యక్షుడు కర్రెప్పలు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇసుక పక్కదారి పడుతోంది..



సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న తహసీల్దార్

రాజోళి: ప్రభుత్వ పనులకు ఇసుకకు అనుమతి ఇవ్వకుండా అక్రమంగా పక్కదారి పడుతోందని సభ్యులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో ఎంపీపీ మరియమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. తుంగభద్ర నది నుంచి ఇసుక బయటకు అక్రమంగా తరలివెళ్తుంటే అధికారులు పట్టించుకోడం లేదన్నారు. ప్రభుత్వ, ప్రజల అవసరాలకు సైతం ఇసుక ఇవ్వడం లేదన్నారు. గ్రామాల్లో గొర్రెల పంపిణీపై వివరాలు చెప్పకపోవడంతో వైస్ ఎంపీపీ రేణుక ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన ఏఈ విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుగుణమ్మ, ఎంపీడీఓ గోవిందు రావ్, తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ పాల్గొన్నారు.

అమావాస్య ప్రత్యేక పూజలు



కోతులగిద్దలో భక్తులకు అన్నదానం చేస్తున్న ఆయల కమిటీ సభ్యులు

రాజోళి: అమావాస్యను పురస్కరించుకుని బుధవారం మండలంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో ఆలయాల్లో విశేష పూజలు చేశారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో మహిళలు అర్చనలు, అభిషేకాలు చేశారు. కర్నూల్ జిల్లాలోని ఉరుకుంద వీరన్న స్వామికి ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవిఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టుతిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, బాబురావు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సవారన్న, అర్చకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు, మండల కేంద్రం, అలంపూర్ చౌరస్తాలోని ఆలయాల్లో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. డీ బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి ఆకుపూజ, సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం హనుమంతు, సుబ్బారెడ్డి, కర్ణాకర్‌రెడ్డిలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మానవపాడు: మండలంలోని అమరవాయి, నారాయణపురం, చెన్నిపాడు, మానవపాడు, పెద్దపోతులపాడు, బోరవెల్లి, జల్లాపురం, కలుకుంట్ల గ్రామాల్లో బుధవారం ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. అమావాస్య కావడంతో ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ధరూరు : మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రధాన ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి, కోతులగిద్ద అరణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధరూర్‌లో డీఆర్ శ్రీధర్, డీఆర్ మంజుల భక్తులకు అన్నదానం చేశారు.

గట్టు : ఆలయాల్లో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గండి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆలయం దగ్గర భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాచర్లలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.